ప్రజాశక్తి

ఆదివారం 12 జనవరి 2025

యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నైపుణ్యపరమైన శిక్షణ ఇచ్చే ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్న్ షిప్ స్కీమ్కు అర్హత సాధించడానికి దరఖాస్తుదారులు ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కలిగి 21-24 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులని అన్నారు. ఆన్ లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు https://pminternship.mca.gov.in/వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్న్ షిప్‌కు ఈనెల 21న ఆఖరని అన్నారు. మరిన్ని వివరాలకు 96769 65949 నెంబరును సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

జిఓ 117 రద్దు పేరుతో
తెలుగుకు మంగళం?

ఏరు దాటకా బోడి మల్లన్న అన్నా చందంగా టిడిపి కూటమి ప్రభుత్వం వైఖరి ఉంది. ఎన్నికల ముందు జీవో 117ను పూర్తిగా రద్దు చేస్తామని, తెలుగు మీడియంను కొనసాగిస్తామని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం జీవో 117 రద్దు పేరుతో తీసుకుంటున్న మార్పులు ప్రభుత్వ విద్యారంగాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్నాయన్న చర్చ జరుగుతోంది. పేద విద్యార్థులకు తెలుగు మీడియం చదువుకు దూరం చేసేలా ఉన్నాయని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. ప్రధానంగా ఎన్‌సిఇఆర్‌టి కోర్సును ప్రవేశపెట్టడం వల్ల తెలుగు మీడియం రద్దయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

- ఇంగ్లీష్ మీడియాన్ని బలవంతంగా రుద్దనున్న ప్రభుత్వం
- 113 ప్రైమరీ పాఠశాలలు హైస్కూల్స్ నుంచి వెనక్కి వచ్చే అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో సంస్కరణలు అమలు చేస్తూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేసింది. ఆ జీవో రద్దు చేసినా ఇంచుమించు అవే విధానాలను అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం గతంలో హైస్కూల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి వెనక్కి వస్తాయి. ఇది శుభ పరిణామమేనని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఈలెక్కన గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనమైన ఉమ్మడి జిల్లాలోని 113 ప్రాథమిక పాఠశాలలు తిరిగి గత పాఠశాలల్లో కొనసాగే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రీ హైస్కూలు విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను తీసుకొస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో కూడా 60 మంది విద్యార్థులపైన ఉన్న పాఠశాలలన్నీ మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా రూపొందిద్దుకుంటే ఈ మోడల్ ప్రైమరీ పాఠశాలలను పంచాయతీకి ఒకటి చొప్పున ఉండే పరిస్థితి ఉంది. విద్యార్థులు ఎక్కువ ఉంటే రెండు మోడల్ స్కూళ్లు కూడా వచ్చే అవకాశం ఉంది. దీనిబట్టి ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 920 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల యుపి స్కూల్స్ పూర్తిగా రద్దవుతాయి. విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చనున్నారు. 6,7,8 తరగతుల విద్యార్థులను దగ్గరలోని పాఠశాలలకు తరలిస్తారు. విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే దాన్ని హైస్కూలుగా మార్చనున్నారు. ఈ లెక్కన జిల్లాలో పలు ప్రాథమికోన్నత పాఠశాలలు విలీనం కానున్నాయి. గతంలో యుపి స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్స్‌గా స్కూల్ అసిస్టెంట్స్ ఉండేవారు.వీరంతా తిరిగి హైస్కూల్‌లో విలీనమయ్యే అవకాశం ఉంది. కొందరు ఎస్‌జిటిలు కూడా హైస్కూల్లో పని చేసేవారు, వారిని కూడా వెనక్కి పంపించనున్నారు. ఈసారి జరిగే హేతుబద్ధీకరణలో ఉపాధ్యాయుల స్థానచలనం ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. హైస్కూల్ ప్లస్‌ను రద్దు చేయడంతో ఆ విద్యార్థులంతా దగ్గరలోని ప్రభుత్వ కళాశాలలకు తరలనున్నారు. జీవో నెంబర్ 117 రద్దుకు సంబంధించిన ప్రతిపాదనల వల్ల బదిలీలు, హేతుబద్ధీకరణలో న్యాయపరమైన చిక్కులు ఎక్కువగా వచ్చే అవకాశముందని విద్యావేత్తలు అంటున్నారు. ముఖ్యంగా పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రతిపాదన వలన పంచాయతీలో చుట్టుపక్కల ఉన్న అనుబంధ గ్రామాల విద్యార్థులు ఆ మోడల్ స్కూల్లో జాయిన్ అవుతారా? లేదా ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తారా అనేది చూడాల్సి ఉంది. ప్రభుత్వం కొత్తగా అన్ని తరగతులకూ ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ను ప్రవేశపెట్టడంతో తెలుగు మీడియం రద్దయ్యే అవకాశం ఉంది.

బడుల సంఖ్య తగ్గించినంత మాత్రాన ఉపయోగంలేదు

రాష్ట్ర ప్రభుత్వం 117వ జీవోను రద్దు చేసి బడుల పేర్లు మార్చి 6 నుంచి 5 వాటి సంఖ్యను తగ్గించినంత మాత్రాన ఉపయోగం లేదు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 20మంది లోపు విద్యార్థులుంటే ఒక్క ఉపాధ్యాయుడ్నే నియమిస్తామని చెప్పడం, 1,2 తరగతులను ఉంచడం వల్ల విద్యా వ్యవస్థకు నష్టం జరుగుతుంది. ఈ సరైన విధానం కాదు.

- ఎస్.మురళీమోహనరావు.
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

కొత్త సీసాలో పాత సారా చందమే

విద్యాశాఖ జీవో నెంబర్ 117ను రద్దు చేయడం సంతోషమే. కానీ ఈ నూతన ప్రతిపాదనలో లేదా డ్రాఫ్ట్ కొత్త సీసాలో పాతసార చందాన ఉంది. ముఖ్యంగా ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంతో ఇంగ్లీష్ మీడియం కూడా సమాంతరంగా సాగించాలి. ప్రస్తుతం ఉన్నటువంటి విషయాలను విశ్లేషిస్తే ఉపాధ్యాయుడికి భారం ఎక్కువగానే ఉంది. కావున ఈ డ్రాఫ్ట్‌ను మార్చవలసిన అవసరం ఉంది. హైస్కూళ్లు దూరంగా ఉన్న ప్రాంతాల్లో యుపి స్కూళ్లను కొనసాగించాలి.

- డి.ఈశ్వరరావు, ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర ఉపాధ్యక్షులు

సమాంతర విద్యను అమలుచేయాలి

ప్రభుత్వ విద్యా రంగంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు రెండింటినీ సమాంతరంగా అమలు చేయాలి. తెలుగు మీడియంలో విద్య కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా బలవంతంగా ఇంగ్లీష్ మీడియంను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం.

- డి.శ్యామ్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు

ప్రతి ఇంట్లో మహిళా వ్యాపారవేత్త ఉండాలి

సర్వీస్ ప్రొవైడర్స్ శిక్షణ ప్రారంభోత్సవంలో మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ప్రతి ఇంట్లో ఒక మహిళా వ్యాపారవేత్త ఉడాలనేది సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి చెప్పారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యాన ప్లంబింగ్, విద్యుత్ వైరింగ్, బ్యూటీషియన్, టివి, ఎసి మెకానిక్ వంటి సర్వీస్ ప్రొవైడర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని, వారిని వ్యాపారవేత్తలుగా తయారు చేయాలనే ఆలోచనతో సర్వీస్ ప్రొవైడర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా సంఘాలనేవి సిఎం చంద్రబాబు నాయుడు మానస పుత్రికలన్నారు. మూడు నెలల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు శిక్షణ కోసం మెప్మా యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భోగీమంటలను వెలిగిస్తున్న మంత్రి సంధ్యారాణి

సంక్రాంతి సంబరాలు ప్రారంభించిన మంత్రి

సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి సంబరాలను మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. అంతకుముందు మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులను పరిశీలించారు. అనంతరం భోగి మంటలకు నిప్పు పెట్టారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు వి.హర్షవర్ధన్, కె.వరలక్ష్మీ, వైదేహి, పట్టణ నాయకులు కొనిసి చిన్ని, బాలాజీ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సంక్రాంతి సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన సాంస్కృతిక, సాంప్రదాయ కళా నృత్య ప్రదర్శన ఔరా అనిపించాయి. కళాభిమానుల ఉత్సాహం ఉరక లేసింది. గిరిజన, పౌరాణిక, ఏకపాత్రాభినయం, జానపద, కూచిపూడి, థింసా బృంద నృత్యాల కళా స్ఫూర్తి వెల్లివిరిసింది. జబర్దస్త్ నటుడు శాంతికుమార్ హాస్య మిమిక్రీ నవ్వులనుపూయించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దంపతులతో పాటు ఇతర శాఖల జిల్లా అధికారులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.

సాంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలు

గణేశ స్తుతి నాట్య ప్రదర్శనతో జిల్లా కలెక్టర్ దంపతులను స్వాగతాన్ని పలికారు. మక్కువ మండలం



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న కలెక్టర్ దంపతులు, సబ్‌కలెక్టర్

విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విబిపురం సాయి బృందం ప్రదర్శించిన తప్పెట గుళ్ళు, పూర్ణిమ, దేవిశ్రీ శిష్య బృందం మూషిక వాహన నృత్యాలు, మాధురి, శ్రావణి బృందం స్వాగత కృష్ణా, శాంతినికేతన్ స్కూల్ చిన్నారుల టం టం పాటకు బృంద నృత్యాలు, అరసాడ జెడ్‌పి హైస్కూల్ బాలికల కోలాటం అందర్నీ ఉర్రూతలూగించింది, పెద్దూరు మర్రాపు నారన్నాయుడు ప్రదర్శించిన నారద ఏకాభినయం, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన థింసా బృంద నృత్యాలు అందరినీ ఉత్తేజపరచాయి. వేయినామాల వాడా... వెంకటేశా బృంద నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘల్లు ఘల్లు జానపద బృంద నృత్యాలు ప్రదర్శించింది. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్‌ఒ కె.హేమలత, అధికారులు, కళాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

భోగి మంటల్లో విద్యుత్తు బిల్లుల దహనం : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరగబోయే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ లను జయప్రదం చేయాలని, అందుకు విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు కోరారు. శనివారం సీతానగరం సంత బజార్లో ప్రచారం చేస్తూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని గత మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలు, ప్రజల పోరాటాలు, విజయాలు, వైఫల్యాలు సమీక్షిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులపై విపరీతమైన భారాలు పెరిగాయని, దేశంలో మతోన్మాద శక్తులు ఎక్కువై పోతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏదీ అమలు చేయలేదన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం

విద్యుత్ సంస్కరణ పేరుతో ప్రజలపై భారాలు కూటమి ప్రభుత్వం వేస్తుందని, వీటిని ప్రజా పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని వేణు అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి రమణమూర్తి, జి.వెంకటరమణ, ఆర్.రాము, బి.అప్పారావు, వై.రామారావు పాల్గొన్నారు.

పోలమాంబ జాతరకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శంబర పోలమాంబ జాతరకు పోలీసులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని భక్తులకు సురక్షితమైన, సులభమైన దర్శనం చేసుకునేలా పటిష్ట బందోబస్తు చేపట్టాలని ఎస్‌పి ఎస్ వి మాధవ్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మక్కువ మండలం శంబంలో శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈనెల 27,28,29న అంగరంగ వైబవంగా జరగబోయే సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు నిమిత్తం పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు నిర్వహించాల్సిన విధి నిర్వహణ, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై దిశా నిర్దేశం చేశారు. శంబర పోలమాంబ అమ్మవారి జాతర, గిరిజన జాతర పండగను తిలకించేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఎక్కువగా ప్రజలు, భక్తులు గ్రామానికి వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా వారి రాకపోకలకు, భద్రతకు ఎటువంటి అవాంతరం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయాల ప్రాంగణం, క్యులైన్‌లో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ముఖ్యంగా తోపులాటకు తావు లేకుండా ఎలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాత్రికుల వ్యక్తిగత భద్రతకు గట్టి భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక క్రైం బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు సూచనలు చేసేందుకు అన్ని ముఖ్య కూడళ్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనాల పార్కింగ్, దారి మళ్లింపు ఉన్న ప్రతి చోటా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ఎంట్రీ, ఎగ్జిట్ గేటుల వద్ద భక్తులకు సమాచారం పూర్తిగా తెలిసేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సిరిమాను తిరిగే మార్గంలో ఎక్కువ మంది ప్రజలు రాకుండా చూసేందుకు ఏరియా క్లియరెన్సు పార్టీలను, రోప్ పార్టీలను ఏర్పాటు చేయాలని, సిరిమాను తిరిగే ప్రదేశాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ యంత్రాంగం, దేవాదాయ శాఖ ప్రోటోకాల్ సిబ్బంది, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల వారితో సమన్వయం చేసుకుంటూ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి అంకిత సురాన, సాలూరు పట్టణ, రూరల్ సిఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, సాలూరు రూరల్, పాచిపెంట, మక్కువ ఎస్ఐలు నరసింహామూర్తి, వెంకట సురేష్, వెంకట రమణ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

లక్ష్య సాధన దిశగా జిసిసి

డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిసిసి యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ చెప్పారు. శనివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జిల్లాలోని అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యం రూ.12 కోట్లని, ఇంత వరకు రూ.6 కోట్ల లావాదేవీలు నడిపినట్లు చెప్పారు. నిత్యవసర వస్తువులు, పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీ, సూపర్ బజార్‌ల్లో వ్యాపార లక్ష్యం రూ.62 కోట్లు కాగా, ఇంతవరకు రూ.42 కోట్లు సాధించినట్లు తెలిపారు. చింతపండుతో సహా ఇతర అటవీ ఉత్పత్తుల ధరలను పెంచినట్లు చెప్పారు. చింతపండు కిలో ధర రూ.34 పెంచినట్లు చెప్పారు. పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో చింతపండు దిగుబడి ఎక్కువగా ఉన్నందున నాణ్యమైన చింతపండు కొనుగోలు చేయాలని సేల్స్ మాన్లను ఆదేశించామని చెప్పారు. అడవి తేనె, కుంకుడు, షికాయ, నరమామిడి చెక్క వంటి ఇతర అటవీ ఉత్పత్తులకు ధరలు పెంచినట్లు చెప్పారు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను జిసిసి డిపోల్లో విక్రయించాలని కోరారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నాణ్యమైన సరుకులు తీసుకొచ్చి నిర్దేశించిన ధరలు పొందాలని కోరారు. కొన్ని అటవీ ఉత్పత్తులకు విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసినట్లు తెలిపారు. ఉసిరి పొడి, షీకాయ, త్రిఫల రసాలను విలువ ఆధారిత వస్తువులుగా విక్రయిస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ చెప్పారు.

పట్టణానికి పండగ శోభ

కొనుగోలుదారులతో రద్దీగా దుకాణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణానికి సంక్రాంతి పండగ శోభ వచ్చింది. పట్టణ ప్రధాన రహదారి శనివారం కొనుగోలు, అమ్మకందారులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఉపాధి, ఉద్యోగాల కోసం దూర ప్రాంతంలో ఉండే వారు తమ స్వగ్రామాలకు వస్తున్న సందర్భంలో పట్టణంలో గల రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్సులో ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. పండగకు కావాల్సిన కొత్త బట్టలు, కిరాణా సామాన్లు, మహిళల అలంకరణ సామాన్లు కొనుగోలు కోసం పరిసర గ్రామాల ప్రజలు భారీగా పట్టణానికి తరలివచ్చారు. దీంతో ఆయా దుకాణ సముదాయాలు కిటకిటలాడాయి. ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాలు రద్దీగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయితే ట్రాఫిక్ పోలీసులు ముందస్తుగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉండగా గతేడాది కంటే ఈ ఏడాది నిత్యవసర వస్తువులు, ఇతర వస్తుల ధరలు ఆకాశాన్ని అంటాయి. దీంతో ప్రజలు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు

పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

ఇజనారానికి ఏట్నేదురా..!



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఇంతోటి బతుకూ ఇల్లాకాతలకే...! అన్నట్టుగా ఉందిరా మోడీ మాటలు. ఇంత కష్టపడి ఇశాకపట్నం వచ్చామా? సలి సూడు ఎలాగా వంచేత్తాంది.... అట్నుంచి బయలుదేరినప్పుడు బాగానే ఉందిగానీ, ఇప్పుడు సూడు ఆ మోడీ మన ఇజనారం గురించి ఒక్కమాట కూడా ఆడలేదు. మనం మాత్రం మన నాయకుల మాటలు నమ్మేసి ఎగోసుకుని వచ్చీనాము.' ఇది నాలుగు రోజుల క్రితం విశాఖలోని మోడీ సభకు వెళ్లొచ్చిన మన జిల్లా వాసుల నోట వినిపిస్తున్న మాటలు. పాపం... ఓ వైపు నాయకుల పోరు భరించలేక... మరోవైపు ఏదో పొరుగునే ఉన్న మన ఇజానారం కోసమూ మాట్లాడకపోతారా? కనీసం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌పైనైనా ఒక క్లారిటీ ఇవ్వకపోతారా? అంటూ భావించినవారికి నిరాశే ఎదురైంది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా అప్పటి కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లు ప్రత్యేక హోదా ప్రకటిస్తే ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఐదు కాదు... తాము అధికారంలోకి వస్తే పదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని నమ్మబలికారు. అంతే కాదు... విభజన చట్టంలోవున్న వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామన్నారు. హోదా ఎలాగూ ఇవ్వలేదు. కనీసం ప్రత్యేక నిధులైనా కేటాయిస్తే మన జిల్లా ఎంతోకొంత అభివృద్ధి చెందేది. ఆ మాత్రం సాయం కూడా చేయలేదు. 'ఇవన్నీ తెలియనివి కాకపోయినప్పటికీ, మోడీ విశాఖ రావడం, ఆయన సభకు వందల ఆర్టీసి బస్సులు మళ్లించడం, ఇవిచాలవన్నట్టు ప్రైవేటు స్కూళ్ల, కాలేజీల బస్సులను కూడా జనాన్ని తరలిచేందుకు ఉపయోగించడం, అందుకోసం ఏకంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు అనధికారికంగా సెలవు ఇచ్చేయడంతో మన జిల్లా అభివృద్ధికి కేంద్రం ఏదో చేస్తుందని ఆశపడ్డామని, ఆ ఆశలన్నీ సభలోనే ఆవిరిగా మిగిలిపోయాయని జనం చర్చించుకుంటున్నారు. అభివృద్ధి సంగతి పక్కనబెడితే పదేళ్లగా కేంద్రంలో వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం జిల్లాకు చేసిందేమీ లేదు సరికదా వివక్ష చూపుతోందని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే విభజన హామీలో భాగంగా మంజూరు చేసిన గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఐదేళ్లు పట్టగా, నిధులు మంజూరు చేసి నిర్మాణాలు మొదలు పెట్టడానికి మరో ఐదేళ్లు సాగింది. ఇప్పటికీ ఆ నిర్మాణ పనులు పునాదుల స్థాయిలోనే ఉండడంతో వర్శిటీ తరగతులు పరాయి పంచల్లో సాగుతున్నాయి. జిల్లా పరిధిలోగల మూడవ రైల్వే లైను నిర్మాణ పనులు నత్తనకడకన సాగుతున్నాయి. మానాపురం, చీపురుపల్లి తదితర చోట్ల చేపట్టిన ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల్లో పురోగతి లేదు. ఇటువంటి చోట్ల ప్రయాణికుల అవస్థలు జిల్లా వాసులకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అధికారంలోకి రాకముందు విజయనగరం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిద్దుతామన్న మాటలు నేడు వినిపించకుండా పోయాయి. రైలు మార్గానికి అనుసంధానంగా తలపెట్టిన మామిడి మార్కెట్ యార్డు కాగితాలకే పరిమితమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటే కేవలం విశాఖపట్నం మాత్రమే కాదు సుమా..! మన జిల్లాకు చెందినవారు వేల సంఖ్యలో అందులో ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు వర్కర్స్, చిన్న చితక కాంట్రాక్టర్లుగా ఉన్నారు. ఈ రకంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మన జిల్లాకు ఎంతో అనుబంధం, ఆర్థిక సంబంధం ఉంది. ఇటువంటి ప్లాంట్‌ను బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ విదేశీ ప్రైవేటు సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో మోడీ ఏదో చేస్తారని ఆశతో వెళ్లిన వారు పుట్టెడు నిరాశతో 'అనవసరంగా వచ్చాము' అంటూ చర్చించుకోవడం వినిపిస్తోంది.

వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ హేమాక్షి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- సీతానగరం

బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి బూర్జ గ్రామంలో శనివారం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ మనం అందించే ఏ చిన్న సాయమైనా ప్రయోజనం ఉంటుందని ప్రతీ సంవత్సరం పలు సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. తన తండ్రి కీర్తిశేషులు తెర్లి గౌరినాయుడు (డిపిఎంఒ), తన సోదరుడు ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్ మోహనరావు తనకు ఎంతో స్ఫూర్తి అని అన్నారు. అనంతరం అక్కడ వృద్ధులతో మాట్లాడి ఆరోగ్యానికి ఆయుర్వేద వైద్యం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో తన భర్త యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.రాజశేఖర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో గల మదర్ థెరిసా కిడ్స్ స్కూల్లో మదర్ థెరిసా సేవాసంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్, కిడ్స్ స్కూల్ సంయుక్తంగా శనివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవా సంఘం- అధ్యక్షులు మరియు మదర్ తెరిసా కిడ్స్ స్కూల్- ప్రిన్సిపాల్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు నూతన్, తనీష్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడింగ్ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2021-22లో ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించిన రైతులకు లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలను చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. వ్యవసాయ సహకార సొసైటీ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం రైతులకు లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలను చెల్లిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సొంత ఖర్చులతో ధాన్యాన్ని తరలించారన్నారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లించకపోవడంతో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే నిధులను ప్రభుత్వం సొసైటీలకు జమ చేసినప్పటికీ రైతులకు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే సొసైటీ అధికారులు స్పందించి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మురళీ పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వేపాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. శనివారం జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామాల్లో 85 మందికి ఎక్స్‌రేలు తీసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, హెచ్‌డబ్ల్యుసిఎంఎల్‌హెచ్‌పి సిహెచ్ఒ పి.పార్థసారథి, హెల్త్ సూపర్‌వైజర్ జివిఎన్ఎస్ఎన్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.సాయిబాబా, సిహెచ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రాణ నష్టం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం గ్రామ సమీపంలో శనివారం వేకువజామున పార్వతీపురం - విశాఖపట్నం రాష్ట్ర రహదారిపై కర్రల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో అధిక లోడుతో వెళ్తున్న వాహనం సాంకేతిక లోపం వల్ల ఒక పక్క ఒరిగిపోయి నెమ్మదిగా బోల్తాపడడంతో, డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న వ్యక్తులకు ప్రమాదం తప్పి, ప్రాణ నష్టం జరగలేదు. వెంటనే రూరల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ట్రాఫిక్కుకు అంతరాయం కలగకుండా ఏర్పాటు చేశారు.

విద్యుత్తు వైర్లకు తగిలిన లారీ

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

విద్యుత్ వైర్లకి కర్రల్లోడుతో వెళ్తున్న లారీ తగిలి పెను ప్రమాదం తప్పిన సంఘటన శనివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. కురుపాం ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్ మెయిన్ వైర్లకు లారీ తగిలిందని వెంటనే విద్యుత్ ఆగిపోవడంతో ప్రమాదం తప్పిందని తరచుగా ఇదే రహదారి అనేక లారీలు తిరుగుతుంటాయని విద్యుత్ వైర్లు కిందకి వేలబడి ఉండడంతో తరచూ ఇటువంటి సంఘటన జరుగుతున్నాయని ఏ క్షణాన ఏటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియదని తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వైర్లను పునరుద్ధరణ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పేకాట శిబిరం పై దాడులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల పరిధిలోని కడకల్లా గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు శనివారం శిబిరంపై దాడులు నిర్వహించగా 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్.జి. కళాధర్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.7220లు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు ఎక్కడైనా పేకాట, గొర్రెపోతు పందేలు జరిగినట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన వివరించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేటకు చెందిన డి.ప్రశాంతి ఇటీవల అదృశ్యమైనట్లు తల్లి బి.సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై. అమ్మనరావు తెలిపారు.

సంతలో కొనుగోలు చేస్తున్న గిరిజనులు

వెలవెలబోయిన నంద సంత

ప్రజాశక్తి- మక్కువ

సాధారణ వేళల్లో కూడా ఎప్పుడూ గిరిజనులతో కిటకిటలాడే నంద వారపు సంత సంక్రాంతి సమీపిస్తున్నా గిరిజనులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో శనివారం వెలవెలబోయింది. సుదూరం నుంచి వచ్చిన చిల్లర వ్యాపారులు వారి అంగడలు కొనుగోలుదారులు లేక డీల పడ్డారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చాలామంది గిరిజన తల్లిదండ్రులు పట్టణాలకు పోయి అటు సరుకులు కొనుగోలతో పాటు పిల్లలను కూడా ఇంటికి తీసుకురావడం పనిలో ఉండడంతో సంత వెలవెల పోవటానికి కారణంగా పలువురు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో నేరుగా ప్రజలకు ఖాతాలో ఏదో ఒక పథకం జనవరి నెలలో జమ అయ్యేదని ఈసారి ఆ పథకాలేమీ లేకపోవడం ఒకంత ప్రజలకు ఆర్థిక ఇబ్బంది ఏర్పడి సంత వెలవెలబోయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పల్లెపండగ ద్వారా గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పల్లెలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమాన్ని అమలు చేసిందిని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని ఎం ఆర్ నగరంలో పల్లె పండుగలో భాగంగా మినీ గోకులాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందినప్పుడే అసలైన అభివృద్ధిని అందుకోసం ప్రభుత్వం గోకులాలు పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆశయం

పార్వతీపురం: రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

నెరవేర్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి మొండి చేయి చూపించిందని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల వారి అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చిన్నరాయుడు పేటలో పల్లెపండగలో భాగంగా మినీ గోకులాన్ని ఎమ్మెల్యే విజయచంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, పెంట సత్యంనాయుడు, గొట్టాపు అప్పలనాయుడు జనసేన, బిజెపి నాయకులు, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం :మినీ గోకులాలతో పాడి పరిశ్రమ అభివద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కురుపాం, పూతికవలస, తోటగూడ గ్రామాల్లో రైతులు నిర్మించిన మినీగోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అంతటి ప్రాధాన్యత గల రంగం పాడి పరిశ్రమని, పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, పాల దిగుబడులు పెంచేందుకు గతంలో టిడిపి ప్రభుత్వం రైతులకు అనేక

కురుపాం: గుకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దుచేసి పాడి రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రాయితీలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మినీ గోకుల షెడ్లు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి జె.రమేష్‌బాబు, ఎపిఒ పి.బావాజీ, వెటర్నరీ డాక్టర్ కె.శైలజ, మేజర్ పంచాయతీ ఇఒ ఎం.ధనుంజయ, మండల టిడిపికన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు ఎన్.వంశీ, జివి రమణమూర్తి, కర్రి శ్రీను, ఎస్.గోవింద, రామకృష్ణ, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ నియామకాలపై నిగ్గుతేల్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన నియామకాలపై నిగ్గు తేల్చాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ క్వాలిటీ కన్సల్టెంట్, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ ఉద్యోగాలతో పాటు టిబి కోఆర్డినేటర్, మెడికల్ ఆఫీసర్, సీనియర్ డిఆర్, హెచ్ఐవి సూపర్వైజర్, అకౌంటెంట్ ఉద్యోగాలు నియామకంలో అవకతవకలు జరిగాయి అంటూ పత్రికలు కోడై కూస్తున్నా పట్టించుకోరా...? అని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్లు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయమన్నారు. తక్షణమే ఆ నియామకాలన్నింటిని రద్దు చేసి, కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఆయా నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలన్నారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా బలగ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఎంపిపి బి.రమణమ్మ భర్త బలగ శ్రీరాములనాయుడు జిల్లా వైసిపి ఉపాధ్యక్షుని నియమితులవ్వడం పట్ల ఆయన శనివారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని ఉండే వాళ్లకు పార్టీ గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను వైసిపి మండల నాయకులు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఆర్‌వి పార్థసారథి, డి.ముకుందరావు, వై గోపాల్‌నాయుడు, వి.నాగేశ్వరరావు సోషల్ మీడియా కన్వీనర్ సురేష్, బి.చిట్టి రాజు, ఎం. ధనుంజయనాయుడుతో పాటు పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మన్యం జిల్లా వైసిపి యాక్టివిటీ సెక్రటరీగా మండలంలోని కామందొరవలస గ్రామానికి చెందిన బుడితి ముకుందరావు, సెక్రటరీగా బంకురు శంకర్రావు నియమితులయ్యారు. వారికి పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

బోనస్ వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

ప్రజాశక్తి - పాచిపెంట

విశాఖ డైరీ యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ము వెంటనే చెల్లించాలని, తగ్గించిన పాల ధర పెంచాలని పాల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాచిపెంటలోని శనివారం పాల రైతుల సంఘం నాయకులు తూముల అప్పన్న, గంగవంశం సత్యనారాయణ, దేవకోట ఎర్రయ్య ఆధ్వర్యంలో పాడి రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ వెంటనే బోనస్ చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని, పాల ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. డైరీ పాలకవర్గం, అధికారులు లక్షల్లో వేతనాలు తీసుకొని, పాల ధరను అమాంతంగా తగ్గించి రైతులను మోసగించడం సరైంది కాదన్నారు. బోనస్ కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. డైరీ లాభాల నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రైతులకు బోనస్ చెల్లించాల్సి ఉండగా సక్రమంగా అమలు చేయడం లేదని, దీనికి యాజమాన్యం పూర్తి బాధ్యత పడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులతో పాటు దానా రేట్లు పెరిగాయని, దానా 75శాతం రాయితీతో ఇవ్వాలని కోరారు. విశాఖ డైరీ లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాస్థాయి మేనేజర్లు, అధికారులు స్పందించి రైతుకు రావాల్సిన బోనస్ చెల్లించి విశాఖ డైరీని సక్రమ మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని, తక్షణమే బోనస్ చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విశాఖ డైరీ పాచిపెంట మండలం డైరీ ఫారం అధ్యక్ష కార్యదర్శులకు వినతి పత్రం అందించి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్తాపు సురేష్, ఎడ్ల గణేష్, మహంతి తౌడు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను సంరక్షించేందుకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాడి రైతులకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే పశుసంపదను సంరక్షించే విధంగా కూటమి ప్రభుత్వం గోశాలలను నిర్మిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, దుమ్మంగి పంచాయతీ పరిధిలో గుమ్మలక్ష్మీపురం, కలిగొట్టు, గుణద గ్రామాల్లో ఎన్ఆర్‌జిఎస్ నిధులతో నిర్మించిన గోశాలలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తరతరాలు నుంచి మనిషి జీవనానికి మనుగడగా ఉన్న పశుసంపదను ప్రభుత్వం కాపాడేందుకు చర్యలు చేపడుతుందని అన్నారు. గుణద గ్రామంలో కొత్తగా నిర్మించిన సి.సి రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, ఎంపిడిఒ సల్మాన్ రాజు, జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, డి.టి శేఖర్, సర్పంచ్ క్రాంతి కుమార్, ఎన్.ఆర్.జి.ఎస్ ఎపిఒ బాబురావు, పంచాయతీరాజ్ ఎఇ నాయకులు భూషణ్ రావు, సుధా, రామకృష్ణ, మన్మధ, రాజేష్, లోవరాజు, ఎన్ ఆర్‌జిఎస్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పండగ సందర్భంగా అందరి కళ్ళల్లో సంతోషం చూడాలనిదే లక్ష్యమని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు కొబ్బరి నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్మికులు ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, టిడిపి నాయకులు బార్నాల సీతారాం, గుండ్రెడ్డి రవి, కోలా మధు, డాక్టర్ భానుప్రసాద్ సిరిపురపు బాషా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ముగ్గులను తిలకిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఆకట్టుకున్న రంగవల్లులు

ప్రజాశక్తి - పార్వతీపురం

సంక్రాంతి సంబరాల వేడుకల్లో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మహిళలు, చిన్నారులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం నుంచి ప్రధాన రహదారి గేటు వరకు దారిపొడుగునా వేసిన రంగవల్లులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తిలకించారు. సాంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా మహిళలను, విద్యార్థినుల వినూత్నంగా తీర్చిదిద్దిన ముగ్గుల ప్రతిభ ఆలోచింపజేశాయని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రతిష్ఠను పెంపొందించేలా రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు, రైతులు ధన, ధాన్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. ఎన్.గౌరమ్మ, జి.శ్రావణి బృంద సభ్యులు కె.పవిత్ర ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. న్యాయ నిర్ణితగా పార్వతీపురం ఎంఇఒ వై.విమల కుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమ లత, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కనకదుర్గ, సిడిపిఒలు, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కేసులు : సిఐ

ప్రజాశక్తి- సాలూరు

సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలో మద్యం తాగి అల్లర్లు, గొడవలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగ సందర్భంగా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ అప్పలనాయుడు చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరి

సీతంపేట: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్ఐ వై.అమ్మనరావు అన్నారు. స్థానిక సంత మార్కెట్ వద్ద శనివారం రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపితే జరిమానా వేస్తామన్నరు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. మితిమీరిన వేగం, ట్రిబుల్ రైడింగ్ నేరమన్నారు. మైనర్లకు వాహనం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పాచిపెంట: నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతికి ఎటువంటి అనుమతీ లేకుండా స్టేజ్ ప్రోగ్రామ్స్ ఆర్గనైజేషన్ చేయకూడదని తెలిపారు. కోడి పందేలు,పేకాట వంటివి ఆడకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ఆటోల్లో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదని హెచ్చరించారు. మద్యం తాగి అల్లర్లు సృష్టించరాదని అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు

సీతానగరం : మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే వారిపై కఠినచర్యలు తప్పవని ఎస్సై ఎం.రాజేష్ హెచ్చరించారు. సంక్రాంతి పండగ రోజుల్లో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, పేకాట, తదితర జూదాలు ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. కోడిపందేల జూదరులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఎవరైనా మండలంలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఇటువంటి కేసుల్లో ఉంటే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని, ఇతర దేశాల్లో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్ పోర్టు పొందే సమయాల్లో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీతంపేట : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా జరిగింది. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఓబన్న చిత్రపటానికి పూలమాలను వేసి, జ్యోతిప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న 1870 జనవరి 11న నంద్యాల జిల్లా సంజమల మండలంలోని నొస్సం గ్రామంలో వడ్డె సుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు జన్మించారన్నారు. ఓబన్న గ్రామ రక్షకునిగా పనిచేశారని, రైతులపై అధిక పన్నులు విధించడం వల్ల బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం చేసే పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఓబన్న పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడ్డానికి, వారికి న్యాయం చేయాలని బ్రిటీష్ వారిని పతిఘటించేందుకు తన ప్రాణాలను కూడా త్యాగం చేశారని గుర్తుచేశారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆత్మవిశ్వాసంతో ముందుసాగాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, కె.అర్.సి ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మచందర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, ఎఫ్ సెక్షన్ పర్యవేక్షకులు జి.శ్రీరామ్మూర్తి, వడ్డే కుల అధ్యక్షులు కె.శంకరరావు ఇతరులు పాల్గొన్నారు.

ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పార్వతీపురం రూరల్ : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి దిలీప్‌కిరణ్ ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో, సైన్యాధ్యక్షుడిగా ఓబన్న పోషించిన తీరు వీరోచితమని, భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని, సమర్ధవంతంగా నడిపించి, దట్టమైన నల్లమల అడవుల్లో సైతం, కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు ఓబన్న అని గుర్తు చేశారు. ఓబన్న పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడ్డానికి, వారికి న్యాయం చేయాలని, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రతిఘటించేందుకు తమ ప్రాణాలను కూడా త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రతీ ఒక్కరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, వారి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, ఆర్ఎస్ఐ లు, ఎస్బీ ఎస్సై లు, ఎస్బి,డిసిఆర్బి, ఎస్‌టిఎఫ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

జాతీయ పురస్కారానికి దేవానంద్ ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత, గాయకుడు, మండ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్‌కు అరుదైన ఘనత దక్కింది. ప్రపంచంలోనే అతి పెద్ద ఐఎస్ఒ గుర్తింపు పొందిన సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో తెలుగు భాష, సంస్కృతి, తెలుగు సాహిత్యం, కళా రంగం లో చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు కీర్తి జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 21న విజయవాడలో శ్రీకళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్ చేతులు మీదుగా అందుకోనున్నారు. ఈ పురస్కారానికి ఎంపికవడం పట్ల దేవానంద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ శ్రీ కొల్లి రామావతి, సభ్యులు ఈశ్వరీ భూషణం, పార్థసారథికి ధన్యవాదాలు తెలిపారు. పురస్కారం రావడం పట్ల గ్రామ ప్రజలు, మిత్రులు, బంధువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.